ప్రజాశక్తి

శుక్రవారం 14 నవంబర్ 2025

5

కర్నూలు

బక్కచిక్కుతున్న బాల్యం

- 63 శాతం మంది పిల్లల్లో పోషకాహార లోపం
- బరువు తక్కువగా 46 శాతం మంది చిన్నారులు
- నేడు బాలల దినోత్సవం

పోషకాహార లోపంతో బాల్యం బక్కచిక్కిపోతోంది. ఎదుగుదల లోపం, బరువు తక్కువగా ఉండటం, రక్తహీనతతో ఐదేళ్లలోపు చిన్నారులు సతమతమవుతున్నారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఫలితాలు ఇవ్వకపోవడంతో జిల్లాలో 63 శాతం మంది పిల్లలను పోషకాహారలోపం వెంటాడుతోంది...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఆనందంగా ఆడిపాడాల్సిన బాల్యం పోషకాహార లోపంతో సతమతమవుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చిన్నారుల్లో పౌష్టికాహార లోపం తీవ్రమైన సమస్యగా కొనసాగుతోంది. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 3,55,811 మంది ఉండగా 63 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. 1,79,685 మంది చిన్నారుల్లో సరైన ఎదుగుదల లేకుండా ఉన్నారు. అందులో 21,349 మంది చిన్నారులు తీవ్ర ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారు. 1,64,741 మంది చిన్నారులు తక్కువ బరువుతో సతమతమవుతున్నారు. 2,26,296 మంది చిన్నారులు రక్తహీనతతో బాధపడుతున్నారు. జిల్లాలోని గ్రామీణ, అర్బన్ పేద కుటుంబాల్లో చిన్నారుల్లో పోషకాహారం లోపం అధికంగా ఉంది. పోషకాహార లోపం కేసులు ఎక్కువగా ఆదోని, పత్తికొండ, ఆలూరు, కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, శ్రీశైలం, చాగలమర్రి, ఆళ్లగడ్డ, గడివేముల ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచకపోవడంతో ఈ సమస్యలు ఎదుర్కొంటున్న చిన్నారుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. అధికారుల తీవ్ర నిర్లక్ష్యం వల్ల పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి మారుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 16 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 3,486 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. పిల్లల ఆరోగ్యం కోసం అన్ని రకాల చర్యలూ చేపడుతున్నట్టు కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్న పరిస్థితులు నెలకొన్నాయనే విమర్శలు ఉన్నాయి. పిల్లల బరువు, ఎత్తు కొలిచే కార్యక్రమమే గ్రోత్ మానిటరింగ్ అంటారు. ప్రతి నెలా అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇది అరకొరగా సాగుతోందనే ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. పౌష్టికాహారం అందించాలంటే తప్పనిసరిగా పేస్ యాప్‌లో నమోదు కావాల్సి ఉంది. పలు ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. అంగన్‌వాడీలు వినియోగిస్తున్న సెల్ ఫోన్లు నాసిరకంగా ఉంటున్నాయి. ప్రభుత్వం వారికి ఫోన్లు సరఫరా చేయడం లేదు. మరోవైపు వర్కర్లకు తీవ్ర పని భారం పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమం అరకొరగా సాగుతోంది. ఫేస్ యాప్ కారణంగా పూర్తిస్థాయిలో చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. పౌష్టికాహారం లోపం బారిన పడిన వారందరూ ఇలా బరువు, ఎత్తు తగ్గిపోతుండడం పట్ల తర్వాత ఆందోళన వ్యక్తం అవుతోంది. గర్భం దాల్చినప్పటి నుంచి మాతా, శిశు ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో నిర్లక్ష్యం జరుగుతోంది. పుట్టే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా పుట్టినట్లయితే సమస్యలు ఉండవు. పౌష్టికాహార లోపం వల్ల పిల్లలు అనేక అనారోగ్య సమస్యలతో పుడుతున్నారు. తల్లులు బలహీనంగా ఉండడం, గర్భస్థ సమయంలో అనారోగ్యానికి గురి కావడం, తక్కువ వయసులో వివాహాలు చేయడం, మహిళల్లో రక్త హీనత పెరగడం, పుట్టే పిల్లలకు కొంతమంది పౌష్టికాహార లోపం వల్ల బరువు తక్కువగా పుడుతున్నారు. ఇలా అనేక కారణాల వలన పిల్లల్లో పౌష్టికాహారం లోపం కనిపిస్తోంది.

రెయిన్‌బో ప్లేటింగ్ వల్ల పోషకాహారం

- డాక్టర్ జి.భరత్ రెడ్డి, నియోనెటాలజిస్ట్

రెయిన్‌బో ప్లేటింగ్ అనే విధానంతో పిల్లల భోజనాన్ని రంగులతో ఆకర్షణీయంగా చేయడం ద్వారా వారికి వివిధ రకాల పోషకాహారాలను అందించవచ్చు. ఇంద్రధనుస్సు రంగుల పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, ప్రోటీన్ వనరులు ఉండేలా భోజనం సిద్ధం చేయాలి. ఎరుపు రంగులోని టమోటాలు, దానిమ్మ, బీట్‌రూట్, స్ట్రాబెర్రీ లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్లు అందిస్తాయి. నారింజ రంగు క్యారెట్, బత్తాయి, గుమ్మడికాయ, మామిడి బీటా కెరోటిన్, విటమిన్ 'ఎ' అందిస్తాయి. పసుపు రంగులోని మొక్కజొన్న, పసుపు మిరపకాయ, అరటి విటమిన్ 'సి', ఫోలేట్‌ను, ఆకుపచ్చగా ఉండే పాలకూర, బీన్స్, బ్రోకలీ, పెసరపప్పు ఐరన్, ఫోలేట్, విటమిన్ 'కె'ను అందిస్తాయి. నీలం, ఊదా రంగులోని జామ, బెర్రీలు, వంకాయ యాంటీ ఆక్సిడెంట్లు, తెలుపు, గోధుమ రంగులోని బంగాళదుంప, ఉల్లిపాయ, కాలీఫ్లవర్ పొటాషియం, ఫైబర్‌ను అందిస్తాయి. రెయిన్‌బో ప్లేటింగ్ వల్ల పోషక విలువల సమతుల్యం ప్రతి రంగు వేర్వేరు పోషకాలు అందిస్తుంది. పిల్లలకు అవసరమైన విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. భోజనంపై ఆసక్తి పెరుగుతుంది.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకూడదని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు, డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్లు, డిపిఒ, డివిజనల్ పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణ అంశంపై ఐవిఆర్‌ఎస్ ద్వారా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించడం జరుగుతోందన్నారు. కోసిగి, ఆదోని, ఎమ్మిగనూరు, కౌతాళం, ఆస్పరి మండలాలు చివరి 5 స్థానాల్లో ఉన్నాయన్నారు. పట్టణాల్లో కూడా ఇంటింటి చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పట్టణాల్లో వీధి కుక్కలకు, వ్యాక్సినేషన్, శస్త్రచికిత్సలు చేయించాలన్నారు. సచివాలయాల్లో సిబ్బంది విధులకు హాజరవుతున్నారా లేదా అని ఆకస్మిక తనిఖీలు చేయాలని కలెక్టర్ ఎంపిడిఒలను ఆదేశించారు. జడ్‌పిసిఇఒ నాసర రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ మనోహర్, హౌసింగ్ పిడి చిరంజీవి, డిపిఒ భాస్కర్, పబ్లిక్ హెల్త్ ఇఇ చంద్రమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి

జిల్లా వ్యాప్తంగా ఇళ్లస్థలాల కోసం లబ్ధిదారులను చూసిన దరఖాస్తులను పరిశీలన త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి రెవెన్యూ అంశాలపై ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, సర్వేయర్ల లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ గ్రీవెన్స్‌ల పరిష్కారంపై సీఎం కార్యాలయం నుండి ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. అధికారులందరూ పిజిఆర్‌ఎస్‌లో ప్రతి రోజు లాగిన్‌అయి అర్జీలు పెండింగు లేకుండా చూడాలన్నారు. వచ్చిన అర్జీలను వచ్చినట్లుగా ఓపెన్ చేసి, వాటిని పరిష్కరించినట్లయితే ప్రాపర్‌గా రెడ్రెస్సల్ చేస్తారన్నారు. పిజిఆర్‌ఎస్ గ్రీవెన్స్‌లను నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. జెసి నూరుల్ కమర్, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్‌డిఒ సందీప్‌కుమార్, పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్, ఆదోని ఆర్‌డిఒ అజయ్ కుమార్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ, పిజిఆర్‌ఎస్ నోడల్ అధికారి దీప్తి పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సిరి

సమస్యల సుడిగుండంలో గ్రంథాలయాలు

- సిబ్బంది కొరత, ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- విజ్ఞాన భాండాగారాలకు 'వారోత్సవాల' వెలుగు

గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

గ్రంథాలయాలు సిబ్బంది కొరత, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. సరిగా నిర్వహణ లేక వెలవెలబోతున్న నేపథ్యంలో ఈనెల 14 నుంచి ప్రారంభమయ్యే 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు వాటి ప్రాధాన్యతను మరోసారి గుర్తు చేయనున్నాయి. విజ్ఞాన నిలయాలుగా, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఆలంభనగా నిలుస్తున్న గ్రంథాలయాలు.. సరైన నిధులు, తగినంత మంది ఉద్యోగులు లేక సేవలను పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నాయి. ఒకవైపు డిజిటల్ యుగంలో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నా, మరోవైపు గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వాలు చూపుతున్న ఉదాసీనత చర్చనీయాంశమవుతోంది. వారోత్సవాల సందర్భంగానైనా గ్రంథాలయాల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించి, వాటికి పూర్వ వైభవం తేవాలని పాఠకులు, మేధావులు కోరుతున్నారు. శుక్రవారం నుంచి ఈనెల 20 వరకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో పుస్తక ప్రదర్శనలు, సాహిత్య చర్చాగోష్టులు, విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నారు.

గ్రంథాలయాల స్థితిగతులు : కర్నూలు ఉమ్మడి జిల్లా కేంద్ర గ్రంథాలయం, 58 శాఖా గ్రంథాలయాలు, ఒక గ్రామీణ గ్రంథాలయం మొత్తం 60 ఉన్నాయి. అద్దె భవనాలు 9, సొంత భవనాలు 38, దాతల సహకారంతో నడిచేవి 11 ఉన్నాయి. చాగలమర్రి, పాములపాడులో గ్రంథాలయ కొత్త భవనాలు త్వరలో ప్రారంభం కానున్నాయి.

సిబ్బంది కొరత : గ్రంథాలయాల్లో 41 మంది శాశ్వత, అవుట్‌సోర్సింగ్ 25 మంది మొత్తం 66 మంది పని చేస్తున్నారు. ఇంకా 60 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిత్యం 400 మంది పాఠకులు వచ్చి చదువుతున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం 14,453 మంది సభ్యత్వం కలిగి ఉంది. 54,984 పుస్తకాలు ఉన్నాయి. గ్రంథాలయానికి రోజూ 9 తెలుగు దినపత్రికలు, ఒక ఉర్దూ, ఒక హిందీ, 5 ఆంగ్ల పత్రికలు వస్తున్నాయి. 30 తెలుగు, ఇంగ్లీషు మేగజైన్లు వస్తుంటాయి. వీటితోపాటు ఎంప్లాయిమెంట్ న్యూస్, విజేత కాంపిటీషన్ లాంటి మాసపత్రికలూ వస్తున్నాయి. సిబ్బంది కొరతతో పాఠకులకు అన్ని సేవలూ సక్రమంగా అందించలేకున్నారు.

ఆర్థిక పరిస్థితులు : గ్రంథాలయానికి సెస్సు రూపంలో రూ.8 కోట్ల బకాయి ఉంది. 2025-26 అక్టోబర్ నాటికి రూ.1.06 కోట్లు వసూలు అయ్యాయి. కర్నూలు కార్పొరేషన్ నుంచి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్లు సెస్సు రావాల్సి ఉంది. కంప్యూటర్లు ఉపయోగించుకునే విద్యార్థులు గంటకు రూ.10 చెల్లిస్తున్నారు. 50 దాకా బ్రెయిలీ లిపిలో పుస్తకాలు ఉన్నాయి. పిల్లలకు రూ.50, పెద్దలకు రూ.100 సభ్యత్వం శాశ్వత చందాగా వసూలు చేస్తారు. ప్రభుత్వ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే డిజిటల్ ల్యాబ్‌తోపాటు, కొత్త పుస్తకాలు, కావాల్సిన సౌకర్యాలు మెరుగుపరుచవచ్చు.

వారోత్సవాలకు నిధుల కేటాయింపు : ప్రతేడాది గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.35 వేలు, ఆదోని గ్రంథాలయానికి రూ.15 వేలు, మున్సిపాలిటీ గ్రంథాలయాలకు రూ.11 వేలు, మండలాలకు రూ.6 వేలు, గ్రామీణ ప్రాంతాల గ్రంథాలయాలకు రూ.2 వేల చొప్పున కేటాయిస్తారు.

పన్ను సక్రమంగా చెల్లిస్తే గ్రంథాలయాల అభివృద్ధి

- మాజీ గ్రంథాలయ అధ్యక్షులు కెజి.గంగాధర్ రెడ్డి

గ్రామస్థాయి నుంచి కార్పొరేషన్ స్థాయి వరకు పన్నుల వసూల్లో గ్రంథాలయ పన్నును 8 శాతం వసూలు చేస్తారు. ఆ పన్నును సక్రమంగా గ్రంథాలయాలకు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటే గ్రంథాలయాలు అభివృద్ధి చెందుతాయి. గ్రంథాలయాలు జ్ఞానాన్ని అందించేవి. వాటికి ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయించి అభివృద్ధి చేయాలి. బుక్ డిపాజిట్ సెంటర్లు పెట్టి పుస్తకాలను సేకరించాలి. న్యాయపరంగా గ్రంథాలయానికి రావాల్సిన పన్నులను రాబట్టేందుకు అవసరమైతే కోర్టుకైనా వెళ్లాలి.

ఉద్యోగాల కల్పనే ధ్యేయం

- జిల్లా గ్రంథాలయ ఎఫ్‌ఎసి కార్యదర్శి వి.పెద్దక్క

గ్రంథాలయాలకు వచ్చే నిరుద్యోగులకు కావాల్సిన పుస్తకాలను అందించి ఉద్యోగాలు కల్పించడమే ప్రధాన ధ్యేయం. ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి బకాయి ఉన్న పన్నులు చెల్లించి ఆదుకోవాలి. గ్రంథాలయాల నిర్మాణానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించి అన్ని ప్రాంతాల్లో గ్రంథాలయాల నిర్మాణం చేయాలి. గ్రంథాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి. ఇక్కడ చదివిన వారు 22 మందికి డిఎస్‌సికి, 25 మంది కానిస్టేబుళ్లు, ఒకరు గ్రూపు-2కు ఎంపికయ్యారు. ఇప్పుడు టెట్‌కు 200 మంది ప్రిపేర్ అవుతున్నారు.

గ్రూపు-కు ప్రిపేర్ అవుతున్నా

- సురేష్, పెంచికలపాడు

నేను ఎంబిఎ, ఎంఎ పొలిటికల్ సైన్స్ చదివాను. ఎసి గదిలో అమ్మాయిలు చదువుకోవడానికి 15 కుర్చీలు కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. గ్రూపు-2 ఉద్యోగం సాధించడమే నా ప్రధాన లక్ష్యం.

లక్ష్య సాధనకు సహకరిస్తాయి

- జగన్నాథం, కానిస్టేబుల్

డిఐజి కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాను. గ్రంథాలయాలు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలన్ని లభిస్తున్నాయి. ఇక్కడ వచ్చి చదువుకొని గ్రూపు-2 ఉద్యోగం సాధించే వరకు పోరాటం సాగిస్తాను.

డయాబెటిస్ కిడ్నీలపై తీవ్ర ప్రభావం

డాక్టర్ సిద్ధార్థ్ హెరూర్ -నేడు ప్రపంచ మధుమేహ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రతి సంవత్సరం నవంబర్ 14న జరుపుకునే ప్రపంచ మధుమేహ దినోత్సవం మధుమేహం పై అవగాహన పెంపు, ముందస్తు గుర్తింపు ,నివారణ చర్యల ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందని కర్నూలు మెడికవర్ నెఫ్రాలజిస్టు డాక్టర్ సిద్ధార్థ్ హెరూర్ తెలిపారు. ఆయన మాటల్లో...డయాబెటిస్ అనేది కేవలం రక్తంలో చక్కెర స్థాయిల పెరుగుదల మాత్రమే కాదు, దీర్ఘకాలంలో మూత్రపిండాలు, గుండె, కళ్ళు వంటి అవయవాలను ప్రభావితం చేసే వ్యాధి. నియంత్రణలో లేని డయాబెటిస్ మూత్రపిండాల పనితీరును దెబ్బతీసి, కిడ్నీ ఫెయిల్యూర్‌కు దారితీసే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి డయాబెటిస్ రోగి తరచుగా మూత్రపిండాల పనితీరు పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. సమయానికి నిర్ధారణ, సరైన ఔషధ వినియోగం, నియమిత వ్యాయామం, తగిన ఆహార నియంత్రణ, రక్త చక్కెర స్థాయిలను పర్యవేక్షించడం ద్వారా డయాబెటిక్ కిడ్నీ వ్యాధిని నివారించవచ్చు. ఆరోగ్యవంతమైన జీవనశైలి ప్రతి డయాబెటిస్ రోగికి అత్యవసరం అని సూచించారు.

పనులను ప్రారంభిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

అభివృద్ధి పనులకు శంకుస్థాన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 20 వ వార్డ్ బిటిఆర్ నగర్ లో డ్రైయిన్స్ నిర్మాణానికి రూ 37.46 లక్షలు, వాసవి నగర్ వేంకటేశ్వర స్వామి గుడి దగ్గర డ్రైయిన్స్ పనులకు రూ 50.00 లక్షలు, టెలికం నగర్ సచివాలయం దగ్గర డ్రైయిన్స్ పనులకు కొరకు రూ 49.00 లక్షలు దాదాపు రూ 136.46 లక్షల ల విలువ గల డ్రెయిన్‌ల నిర్మాణానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం టెలికం నగర్ పార్కు లో ఉన్న 51,52 సచివాలయాలను ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తనిఖీ చేసి, సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అండగా ఉండి, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందజేయాలని తెలిపారు. నగర మున్సిపల్ కమిషనర్ పి.విశ్వనాథ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి,19 వ వార్డ్ ఇంచార్జి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, ఓర్వకల్లు టిడిపి మండల కన్వీనర్ బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్కే శ్రీనివాస రావు,వార్డ్ నాయకులు శ్రీకాంత్, చాంద్ బాషా రమేష్ యాదవ్, మహిళా నాయకురాలు వసుంధర, రాములమ్మ, స్వాములు, మున్సిపల్ అధికారులు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ సమీపంలో పొంచిఉన్న ప్రమాదం

- శిథిలావస్తలో భద్రత కోసం నిర్మించిన కట్టడాలు
- పారిశుధ్యం పడకేసింది
- పిపిఎస్‌ఎస్ పరిశీలనతో వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉందని వెంటనే రైల్వే శాఖ స్పందించాలని పలు కాలనీల ప్రతినిధులు ఆర్.మద్దిలేటి, ఎస్అన్వర్ బాష, ఇ. లక్ష్మణ గౌడు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, కె మధుసూదన్ కోరారు. గురువారం పలు కాలనీల ప్రతినిధులతో కలిసి ప్రతినిధి బృందం కర్నూలు రైల్వే స్టేషన్, హంద్రీ నది బ్రిడ్జి ప్రాంతాలలో పర్యటించింది. వారు మాట్లాడుతూ హంద్రీ నది బ్రిడ్జి ప్రక్కన రైల్వే లైన్ల భద్రత కోసం నిర్మించిన కట్టడాలు నెర్రెలు చీలి..శిథిలావస్థకు చేరి రైల్వే ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. రైల్వే శాఖ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని విమర్శించారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన కర్నూలు రైల్వే స్టేషన్ కు ఎంతో చరిత్ర ఉందన్నారు. రాయలసీమకు ముఖద్వారం అయిన రైల్వే స్టేషన్ ఎదుట పారిశుధ్యం లోపించి దుర్వాసన వస్తుందన్నారు. 20 ఏళ్ల క్రితం రైల్వే భద్రత కోసం నిర్మించిన కట్టడాలు కృంగిపోతున్నాయని ఆనాడే కార్పొరేటర్ గా ఉన్న ఇరిగినేని పుల్లారెడ్డి తో పాటు పలువురు రైల్వే అధికారులను హెచ్చరించామని గుర్తు చేశారు. అప్పటినుండి తాత్కాలిక..నాసిరకంగా నిర్మాణాలు చేసి రైల్వే అధికారులు చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు. వెంటనే రైల్వే శాఖ ఉన్నతాధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని రైల్వే ప్రయాణికులకు, రైళ్లకు భద్రత కల్పించాలని కోరారు. రాయలసీమకు ముఖ ద్వారం గా ఉన్న రైల్వే స్టేషన్ సమీపంలో మూలమూత్రాల దుర్వాసన వస్తుందన్నారు వెంటనేపారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. ఈ పర్యటనలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎండి యూనూస్, ఎస్.రమణ గౌడ్, వై.రామాంజనేయులు పలు కాలనీల ప్రతినిధులు ఎం.నాగరాయణ, వి రామిరెడ్డి, టి. సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పట్టాల వద్ద శిథిలమైన పట్టీలను పరిశీలిస్తున్న పిపిఎస్‌ఎస్ ప్రతినిధి బృందం



రీ సర్వేలో భూములు హాంఫట్

- రెవెన్యూ అధికారుల మాయాజాలం -బాధిత రైతు గగోలు
- ప్రభుత్వం చేపట్టిన రి సర్వేలో భూమిని కోల్పోయిన రైతు

ప్రజాశక్తి-మద్దికేర : రెవెన్యూ అధికారుల నిర్వాకం వల్ల భూరిసర్వేలో ఓ రైతు భూమిని పోగొట్టుకున్న సంఘటన మండల పరిధిలోని బస్నేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ప్రభుత్వం రీసర్వే చేపట్టి రైతుల భూములను కాపాడాలనే చేస్తున్న రీసర్వే కొంత మంది రైతుల పాలిటశాపంగా మారుతుంది. రెవెన్యూ అధికారుల మాయాజాలం కారణంగా, కొంతమంది నిజమైన రైతులకు, భూమిని కోల్పోవలసిన పరిస్థితి కూడా వస్తుంది. బస్నేపల్లి గ్రామానికి చెందిన గరక ప్రతాప్‌కు 898/2సి సర్వేనెంబర్‌లో 5 ఎకరాలు భూమి ఉంది. గత 30 ఏళ్లుగా రికార్డు ప్రకారంగా ఉన్న భూమి ఒక్కసారిగా రీసర్వే వల్ల, ఎకరా, ఒక సెంటు, భూమి కోల్పోవలసి వచ్చింది. రీసర్వేలో 5 ఎకరాల భూమి, రైతుకు దక్కాల్సి ఉండగా, మూడు ఎకరాల 99 సెంట్లు మాత్రమే చూపిస్తుంది. మిగతా ఒక ఎకరం ఒక సెంటు భూమి పక్కన ఉన్న రైతుల ఖాతాలోకి వెళ్లిపోయింది. తన భూమిని తనకు దక్కేలా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో, పలుమార్లు, అర్జీ ఇచ్చినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు.రెవెన్యూ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్లే, అన్యాయం జరిగిందని, బాధిత రైతు వాపోతున్నాడు. జిల్లా కలెక్టర్ స్పందించి, తనకు న్యాయం చేయాలని లేని పక్షంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి

4 మండలాల అధ్యక్షులు ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి- కోడుమూరు

రానున్న రోజుల్లో టిడిపి బలో పేతానికి నూతన కమిటీలు దోహద పడానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సూచించారు. కెడిసిసిబి ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కోడుమూరు మండల కేంద్రంలోని స్నేహ వినాయక ఫంక్షన్ హాలులో టిడిపి క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే లక్ష్యంతో, కోడుమూరు నియోజకవర్గంలోని 4 మండలాల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం కొత్తగా ఎన్నికైన 4 మండలాల అధ్యక్షులు, గూడూరు, కోడుమూరు టౌన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల సభ్యులు తమతమ బాధ్యతలను స్వీకరించారు. పార్టీ సిద్ధాంతాలకు, ప్రజలకు విశ్వసనీయంగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడంలో ఈ కమిటీలే ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని, మన ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి చేరవేయాలన్నారు. టిడిపి రాష్ట్ర నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి కేక్ తినిపిస్తున్న టిడిపి నాయకులు

సమీక్షలో మాట్లాడుతున్న సూపరిన్‌టెన్‌డెండ్ డాక్టర్ వెంకటేశ్వర్లు

ఎన్‌టిఆర్ వైద్య సేవ సిబ్బందితో సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరి కాన్ఫరెన్స్ హాలులో డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ సిబ్బందితో ఆసుపత్రి అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎన్‌టిఆర్ వైద్యసేవకు సంబంధించిన పెంచిన నెల వారి కేసులను వారికి ఇచ్చిన టార్గెట్లను అధిగమించి వాటి అనుగుణంగా సేవలను ఇంప్రూవ్ చేసుకోవాలని డేటా ఎంట్రి ఆపరేటర్‌ను ఆదేశించారు. సేవ క్లెయిమ్స్, ప్రాధాన్యత కేసులు ఎప్పటికప్పుడు క్లియర్ చేసుకోవాలని వారికి ఆదేశించారు. ఆసుపత్రిలోని డేటా ఎంట్రీఆపరేటర్స్ సమయపాలనలో ఉండి పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలలో పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని ఆకస్మిక తనిఖీలపై ఎవరైనా నిర్లక్ష్యం వస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌ఎంఒ డాక్టర్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఎస్ఆర్‌ఎంఒ డాక్టర్ పద్మజ, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్టాండ్‌లో విస్తృత తనిఖీలు

-కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఇటీవల ఢిల్లీలో జరిగిన పేలుళ్ల నేపథ్యంలో జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో కర్నూలు పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా కర్నూలు ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో గురువారం వాహనాలను తనిఖీ చేశామనికర్నూలు డిఎస్‌పి జె.బాబుప్రసాద్ తెలిపారు. నెలల తరబడి బైక్‌లు, కార్లు పార్కింగ్ చేసిన ప్రదేశాలలో, పార్సిల్ రవాణా కార్యాలయంలో డిఎస్‌పితోపాటు సిఐలు నాగరాజారావు, మన్సురుద్దీన్, కర్నూలు నాల్గవ పట్టణ ఎస్సై శ్రీనివాసులు, స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందాలు, పోలీసు జాగీలాలతో తనిఖీ చేశారు. కర్నూలు ఆర్‌టిసి బస్టాండ్ లోని అనుమానితులను, ప్రయాణికుల బ్యాగులు, పరిశీలించారు. అనుమానితుల కదలికలు, పార్సిల్ కార్యాలయంలో లగేజీలపై ప్రత్యేక నిఘా ఉంచారు. అనుమానిత వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే డయల్ 112 కు , డయల్ 100 కు , స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు డిఎస్‌పి జె.బాబుప్రసాద్ సూచించారు.

మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

సిసిఐ నిబంధనలు సడలించాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సిసిఐ నిబంధనలతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని, నిబంధనలను సడలించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. గురువారం రైతుసంఘం ఆధ్వర్యంలో ఆదోనిలో సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కువ సంఖ్యలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సిసిఐ నిబంధనలను సడలించి రైతుల దగ్గర ఉన్న పత్తినంతా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత పది రోజుల నుంచి సిసిఐ కేంద్రంలో మూడు ఫ్యాక్టరీల్లో కలిపి కేవలం 12 వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడం అన్యాయమన్నారు. లీజుకు తీసుకున్న ఫ్యాక్టరీ కెపాసిటీని బట్టి స్లాట్ బుకింగ్‌కు అవకాశం ఉండడం వల్ల చాలామంది రైతులకు స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం లేదని తెలిపారు. మూడు ఫ్యాక్టరీల్లో కలిపి కేవలం 5 వేల కింటాళ్లకే స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం ఇవ్వడం వల్ల చాలామంది రైతులు స్లాట్ బుక్ చేసుకోవడం సాధ్యం కావడం లేదని చెప్పారు. చాలామంది రైతులు స్లాట్ బుకింగ్ కోసం గ్రామాల్లో పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. ఎక్కువ సంఖ్యలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రోజుకు లక్ష క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని, సిసిఐ నిబంధనలు సడలించి రైతుల దగ్గరున్న పత్తినంతా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటా రూ.8,110 ప్రకారం కొనుగోలు చేయాలని, తూకంలో మోసాలు అరికట్టాలని కోరారు. ఒక్కో రైతు రెండు క్వింటాళ్ల చొప్పున తూకంలో మోసానికి గురవున్నారని, రైతులు తిరగబడితే వాటిని సరి చేశారని తెలిపారు. భవిష్యత్తులో మోసాలు జరగకుండా అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బాష, అయ్యప్ప, నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ


సంతకాల సేకరణ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు మాజీ ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి నాయకత్వంలో గురువారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సంతకాల సేకరణ చేపట్టారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, వైసిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఫయాజ్ అహ్మద్, మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, వైస్ ఛైర్మన్ ఎంఎంజి.గౌస్, నరసింహులు, కౌన్సిలర్లు మమ్మత్తు స్వామి, భాస్కర్, బాలాజీ, చలపతి, మల్లి, ఇంతియాజ్, రహీం, సనాత్ ఇక్బాల్, అశోక్, ఆనంద్, గోవిందు, రామ్‌లింగేశ్వర యాదవ్, ఎరుకల లక్ష్మి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఏసోబు, సాబీర్, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కోటి సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సంతకం చేస్తూ వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్పానికి మద్దతు ప్రకటించారని చెప్పారు.

సచివాలయానికి మోక్షమెప్పుడు..?

ప్రజాశక్తి - నందవరం

నిర్మాణం పూర్తయిన సచివాలయం

మండలంలోని ఇబ్రహీంపురం గ్రామంలో నిర్మాణం పూర్తయినా సచివాలయానికి మోక్షమెప్పుడు వస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా అందించడానికి గత వైసిపి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను చేపట్టింది. రూ.లక్షలు ఖర్చు పెట్టి నూతన సచివాలయాలను నిర్మించింది. వైసిపి ప్రభుత్వంలో చివరి దశలో నిలిచిన ఇబ్రహీంపురం సచివాలయం ప్రస్తుతం వినియోగానికి సిద్ధంగా ఉంది. సచివాలయ నిర్మాణం పూర్తయి నెలలు గడిచినా నిరుపయోగంగానే ఉంది. సచివాలయ నిర్మాణం పూర్తయినా ప్రారంభించడానికి అధికారులు మొగ్గు చూపడం లేదు. వీరి నిర్లక్ష్యం వల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. అద్దె ఇంట్లో సచివాలయాన్ని నిర్వహిస్తూ అద్దె రూపంలో ప్రజాధనం దుర్వినియోగానికి అధికారులు పాల్పడడం ఆలోచించదగ్గ విషయమని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఎమ్మెల్యే తీరు అసమంజసం

- అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం - ఎంపీ నాగరాజు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి సహకారంతో ఎమ్మెల్యేగా గెలిచి.. వైసిపి వారికి లబ్ధి చేకూరేలా ఎమ్మెల్యే పార్థసారథి వ్యవహరించడం సమంజసం కాదంటూ టిడిపి నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఆదోనిలో టిడిపి కేడర్ నిర్లక్ష్యానికి గురవుతుండడం వల్ల అసంతృప్తితో ఉన్నారని, సముచిత స్థానం కల్పించేలా అధిష్టానం శ్రద్ధ చూపాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి మీనాక్షి నాయుడు డిమాండ్ చేశారు. గురువారం మీనాక్షి నాయుడు గృహంలో మండల, పట్టణ, క్లస్టర్, బూత్ కన్వీనర్ల ప్రమాణ స్వీకారోత్సవం సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, టిడిపి నియోజకవర్గ అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. వ్యక్తిగతంగా ఎమ్మెల్యే పార్థసారథి మంచి వ్యక్తి అని, కొందరి మాటలు విని టిడిపి కేడర్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. అధిష్టానానికి అన్ని వివరాలూ తెలియజేస్తున్నామని, త్వరలోనే మంచి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ... నెలకోసారి నియోజకవర్గంలో పర్యటించి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ... టిడిపి నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు నిర్లక్ష్యానికి గురవుతున్నట్లు స్పష్టం అవుతోందని, ఎమ్మెల్యే పార్థసారథి వ్యవహారం పట్ల బిజెపి, టిడిపి అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు మాట్లాడుతూ... 40 ఏళ్లుగా టిడిపికి కట్టు బానిసల్లాగా.. అన్న మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు పార్టీ అభివృద్ధికి కషి చేస్తున్నామన్నారు. అధికారం వచ్చిందే తప్ప కార్యకర్తలకు న్యాయం జరగకపోవడంతో నిరాశలో ఉన్నామని తెలిపారు. కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప మాట్లాడుతూ... ప్రభుత్వం తమదే అయినా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగడం లేదని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు శివప్ప, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరెకల్ రామకృష్ణ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షులు వాల్మీకి తిమ్మప్ప, ఎల్ఎల్‌సి ఛైర్మన్ రామస్వామి, జిల్లా మైనార్టీ నాయకులు అప్సర్ బాషా, శ్రీకాంత్ రెడ్డి, పాడేగల్ అయ్యన్న, రంగస్వామి నాయుడు, సాధికా బేగం, రాజేశ్వరి, శాంతి, యువ నాయకులు భూపాల్ చౌదరి, మారుతి నాయుడు, సిద్ధార్థ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, మాజీ కౌన్సిలర్ అంజి, శ్రీరామ్, ఆనవాలు బాషా, మదిరే వీరేష్, మంగలి నాగరాజు, గిడ్డి శంకర్, కృష్ణారెడ్డి, బాబు నాయుడు, ఏసు, రాజారత్నం ఉన్నారు.

జెండాను ఆవిష్కరించిన ఎంపీ నాగరాజు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

మాట్లాడుతున్న నాయకులు

తాగునీటి పైపు లీకేజీని పట్టించుకోరా..?

- పంట పొలాల్లోకి తాగునీరు...

ప్రజాశక్తి - చిప్పగిరి

కొన్ని గ్రామాల్లో తాగునీరు దొరకక ఇబ్బందులు పడుతుంటే మరో పక్క తాగునీరు వెళ్లే పైపులు లీకేజీ అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. తాగునీరంతా పంట పొలాల్లోకి వెళ్తోందని నంచర్ల గ్రామవాసులు వాపోతున్నారు. చిప్పగిరి జలాశయం నుంచి చిప్పగిరి, నంచర్ల గ్రామాల మీదుగా మద్దికెరకు వెళ్లే ప్రధాన పైపులైన్ నంచర్ల గ్రామ సమీపంలో లీకేజీ కావడంతో వచ్చే తాగు నీరంతా పంట పొలాల్లోకి వెళ్తోందని రైతులు తెలిపారు. వెంటనే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి ప్రధాన పైపునకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జీగా రంగస్వామి నాయుడు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఎమ్మెల్యే బీవీతో రంగస్వామి

టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జీగా రంగ స్వామి నాయుడు ఎంపికయ్యారు. గురువారం నియోజకవర్గంలోని మూడు మండలాలకు టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జీలను ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ఎంపిక చేసి వారి చేత ప్రమాణం చేయించారు. గోనెగండ్ల క్లస్టర్ ఇన్‌ఛార్జీగా తెలుగు యువత మండల అధ్యక్షులుగా ఉన్న రంగ స్వామి నాయుడుకు ఎమ్మెల్యే బీవీ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా రంగస్వామి నాయుడు మాట్లాడారు. ఎమ్మెల్యే బీవీ పార్టీలో యువతకు పెద్దపీట వేశారని, క్లస్టర్ ఇన్‌ఛార్జీగా తనను ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో అందరినీ కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు.

నియోజకవర్గాన్ని దోచిన ఎమ్మెల్యే చిట్టా విప్పుతా

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి నియోజకవర్గాన్ని దోచిన చిట్టాను త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్దే కాకుండా.. నియోజకవర్గ ప్రజల ముందు విప్పుతామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన మండల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, గ్రామ బూత్ కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి టిడిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు అహర్నిశలు కృషి చేస్తున్నారని, వారి ఆదేశాలతో విభేదాలను వీడి కలిసికట్టుగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేసేందుకు తిక్కారెడ్డి గ్రూపును కూడా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచినప్పుడే ఎమ్మెల్యేగా గెలవగలమని చెప్పారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలనాగిరెడ్డి ఏనాడూ నియోజకవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించినట్లు ఎవరూ చూడలేదని ఎద్దేవా చేశారు. మండలాలను రెడ్ల సామాజిక వర్గానికి ఇచ్చి దోచుకున్న విషయాలను బయట పెడతానని తెలిపారు. నియోజకవర్గంలో అత్యధికంగా బీసీలున్నా ఒక్క పదవి కూడా ఇవ్వకుండా అణచివేస్తున్నారని విమర్శించారు. 'విభజించి పాలించు' అనే ధోరణిలో ఎమ్మెల్యే ఉన్నారని, 97 వేల మంది బోయ ఓటర్లు ఉన్నారనే విషయం మర్చిపోవద్దని తెలిపారు. తన తండ్రి రామిరెడ్డికి కెడిసిసి ఛైర్మన్ పదవి ఇవ్వడం వల్లే తనకు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇచ్చినట్లు చెబుతున్నారని, మరి ఇప్పటి వరకు కెడిసిసి ఛైర్మన్ పదవులు చేపట్టిన వారి కుమారులకు ఎంతమందికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారో చూపించాలని హితవు పలికారు. మంచాల సొసైటీ ఛైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... 'నీకు, మీ నాన్నకు ఎమ్మెల్యే కావడానికి టిడిపి అవకాశం ఇచ్చింద'నే విషయం గుర్తు పెట్టుకోవాలని, బీవీ.మోహన్ రెడ్డి పుణ్యం వల్ల ఎమ్మెల్యేగా గెలిచావని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి సూచించారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు ఎన్నికైన ఎస్.ఎం.గోపాల్ రెడ్డి మాట్లాడుతూ... ఆనంద బాష్పాలతో కన్నీటి పర్యంతమయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి సామాన్య కార్యకర్తగా సేవలందించానని, ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డికి, ఆయన సోదరులకు, కుమారులకు కృతజ్ఞతలు తెలిపారు. యువ నాయకుడు రాకేష్ రెడ్డి కూడా టెక్నాలజీ ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. సభాధ్యక్షులు అశోక్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు పల్లెపాడు రామిరెడ్డి, కోసిగి ముత్తురెడ్డి, కౌతాళం మండల అధ్యక్షులు సురేష్ నాయుడు, బసలదొడ్డి ఈరన్న, యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, సొసైటీల అధ్యక్షులు వెంకటపతి రాజు, రాఘమ్మ, చావిడి వెంకటేష్, మాజీ జడ్‌పిటిసి లక్ష్మయ్య, వరదరాజులు, నరసింహ, రాఘవేంద్ర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రరెడ్డి

అధ్వానస్థితిలో కల్వర్టు..

- ఇక్కట్లలో వాహనదారులు

ప్రజాశక్తి - దేవనకొండ

అధ్వాన స్థితికి చేరుకున్న కల్వర్టు

మండలంలోని పుల్లా పురం – తెర్నేకల్ గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు అధ్వాన స్థితికి చేరుకోవడంతో వాహన దారులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పుల్లాపురం గ్రామం నుంచి తెర్నేకల్ గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న మట్టి రహదారి అధ్వానస్థితికి చేరుకోవడంతో వాహనదారులు, రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు వర్షపు నీటికి కుంగిపోవడంతో రైతులు పండించిన వివిధ పంటల ఉత్పత్తులను ఎమ్మిగనూరు, ఆదోని మార్కెట్‌కు తీసుకెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మట్టి రహదారి కూడా గుంతలు పడి కంకర తేలి ఉండడంతో ప్రయాణం ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖాధికారులు మట్టి రహదారి, కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

కనకదాసును ఆదర్శంగా తీసుకోవాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణా

ప్రజాశక్తి - హొళగుంద

ప్రతి ఒక్కరూ కనకదాసును ఆదర్శంగా తీసుకోవాలని హొళగుంద ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణా తెలిపారు. కనకదాసు జయంతి సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం కనకశ్రీ యూత్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. డాక్టర్ భరత్ కుమార్ మాట్లాడుతూ... ఇంటర్మీడియట్ దశ చాలా కీలకమైందని, ఇంటర్మీడియట్‌లోనే ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలని తెలిపారు. మాదాసి కురువ సంఘం గౌరవాధ్యక్షులు కాలిక ప్రసాద్, సలహాదారుడు కోగిలతోట శేషప్ప, డాక్టర్ రామాంజి, ఈసా, చిదానంద, ఈరప్ప, పంపాపతి, దిడ్డి వెంకటేష్, కాకి పకీరప్ప, కృష్ణయ్య, జాకీర్, లక్మన్న, మంజు, సిఐటిసి నాగరాజ్, గర్జప్ప, ఆనంద్, కృష్ణ, వేణు, ఎండి.హళ్లి సర్పంచి సుధాకర్, నాయకులు ఎస్‌కె.గిరి, గాదిలింగప్ప, మల్లయ్య, గాది, రామకోటి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలం

- డివిజన్ ట్రైనర్ నాగేష్

ప్రజాశక్తి - కోసిగి

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, ప్రతి రైతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి గోమూత్రం, ఆవు పేడతో ప్రకృతి వ్యవసాయం చేసి అధిక దిగుబడులు పొందాలని డివిజన్ ట్రైనర్ నాగేష్ తెలిపారు. గురువారం జిల్లా డిపిఎం మాధురి ఆదేశాల మేరకు కోల్మాన్‌పేట యూనిట్ ఇన్‌ఛార్జీ రాజం, తమ సిబ్బందితో కలిసి దుద్ది గ్రామంలో ఐసిఆర్‌పి నాగరాజు పొలంలోని నాలుగున్నర ఎకరాల పొలంలో పిఎండిఎస్ పద్ధతిలో విత్తనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ... ఈ పద్ధతి ద్వారా భూమిలోని సూక్ష్మ జీవులు, రైతుకు మేలు చేసే వానపాములు ఎండవేడికి చనిపోకుండా ఉండేందుకు ఈ పద్ధతి ఉపయోగపడుతుందని తెలిపారు. 30 రకాల విత్తనాలు ఒకేసారి భూమిలో వేయడం వల్ల పంటలతో భూమి కప్పబడి ఎండ తీవ్రతకు భూమిలోపలి నీటి శాతం తగ్గిపోకుండా భూమి గొల్లబారి కలుపు అరికడుతుందని చెప్పారు. రైతులంతా ఈ పద్ధతి పాటించి ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని తెలిపారు.

కార్యకర్తలకు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శ


పరామర్శిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్ణాటక రాష్ట్రం జిల్లా కేంద్రమైన రాయచూరులో చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్తలు ఉలవ లక్మన్న, ఎంసి.లక్మన్నను టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి గురువారం పరామర్శించారు. మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఎంసి.లక్మన్న, ఉలవ లక్మన్నలు అనారోగ్యంతో రాయచూర్ ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విషయంలో తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి ఆదేశాల మేరకు శ్రీనివాస్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, నరసింహారెడ్డి ఉన్నారు.

21 నుంచి జిడిపి కాలువలకు నీటి విడుదల

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 21 నుంచి మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేయనున్నట్లు గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కెఇ.మల్లికార్జున గౌడ్, డిఇ సుబ్బరాయుడు తెలిపారు. గురువారం గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద ప్రాజెక్టు పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ రబీ సీజన్‌లో గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఆయకట్టు భూములకు సాగునీటిని ఈనెల 21 నుంచి కుడి, ఎడమ కాలువలకు విడుదల చేసి మార్చి వరకు నీరందించేందుకు తీర్మానించినట్లు తెలిపారు. ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు మద్దయ్య, ఎఇలు చిన్న అలీ, శంకర్, సిబ్బంది ఉగ్ర నరసింహ, నీటి సంఘాల అధ్యక్షులు కౌలుట్ల, బడేసాబ్, రంగన్న, కృష్ణ పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జీ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని మున్సిపల్ ఇన్‌ఛార్జీ కమిషనర్‌గా అసిస్టెంట్ కమిషనర్ నాసిర్ హుస్సేన్ బాధ్యతలు చేపట్టారు. గురువారం ఆయన మాట్లాడారు. కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కృష్ణ వ్యక్తిగత కారణాల వల్ల సెలవుపై వెళ్లారన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం ఇన్‌ఛార్జీ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. శానిటేషన్, తాగునీటి సరఫరా, ఇతర సేవల్లో ఇబ్బంది కలుగకుండా చూస్తామని చెప్పారు. ఆయనను పలువురు అభినందించారు.

ర్యాలీలో పాల్గొన్న ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే పార్థసారథి

దేశ సమగ్రతను కాపాడదాం

- ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

దేశ ఐక్యతను చాటి సమగ్రతను కాపాడే దిశగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. గురువారం ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థులు నిర్వహించిన సమైక్యత ర్యాలీని జెండా ఊపి కళాశాల నుంచి మున్సిపల్ మైదానం వరకు ప్రదర్శనలో నడిచారు. కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆరెకల్ రామకృష్ణ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకోవాలన్నారు. ప్రాంతాలు వేరైనా దేశం ఒక్కటే అన్న భావన ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని తెలిపారు. మహనీయుల త్యాగాల వల్ల దేశం సురక్షితంగా ఉందని, అందరూ బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. టూ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, నాయకులు మల్లికార్జున, మధుసూదన్ శర్మ, నాగరాజు గౌడ్, నాగరాజు, నాగార్జున, కునిగిరి నాగరాజు, ఉషా రాజు, సూర్య ఉన్నారు.

ఆదోనిలో ట్రైయినీ ఐఎఎస్‌ల పర్యటన

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ట్రైయినీ కలెక్టర్లు పర్యటించారు. పట్టణాభివృద్ధి తీరును, పారిశుధ్య పనుల నిర్వహణను స్వయంగా తెలుసుకునేందుకు గురువారం ట్రైయినీ ఐఎఎస్‌ల బృందం పలు వార్డుల్లో పర్యటించింది. ఆదోనిలో జరుగుతున్న శానిటేషన్, అభివృద్ధి పనుల తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. బోయగేరి, కిల్చిన్‌పేటలోని కమేలా, పశువధశాల, బీరప్ప నగర్‌లో పరిసరాలను పరిశీలించారు. ఇంటి చెత్త సేకరణ, వ్యర్థాలు డంప్ యార్డ్‌కు తరలింపు, ప్లాస్టిక్ నిషేధం అమలుకు తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. మహవీర్ మున్సిపల్ పార్కును సందర్శించి, వాటి నిర్వహణ, సందర్శకులకు చేపట్టిన ఏర్పాట్లను కౌన్సిలర్ సందీప్ రెడ్డిని అడిగి పరిశీలించారు. మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, మున్సిపల్ ఇన్‌ఛార్జీ కమిషనర్, నాసిర్ హుస్సేన్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ గోపీనాథ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాల మద్దయ్య ఉన్నారు.

చండీ హోమంలో ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చండీ హోమంలో పాల్గొన్న ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే బీవీ

పట్టణంలోని వీవర్స్ కాలనీ మైదానంలో 87వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. 14 రోజుల పాటు సాగే ఈ మహాయాగ మహోత్సవాల్లో భాగంగా 13వ రోజు గురువారం నిర్వహించిన చండీ హోమానికి ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డితో కలిసి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు. రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

ఆదోని పట్టణ ప్రజలకు తెలియ జేయడం ఏమనగా శ్రీ **నామాల వీరేశ్ S/o. నామాల హనుమంతు,** వయస్సు: 44 సం॥రాలు, 1-135 BC కాలనీ సాదాపురం గ్రామం ఆదోని మండలం. వీరికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంటు సాదాపురం నుండి ఆదోని కు వాహనం పై వస్తుండగా 01.11.2025 శనివారం రోజు **డాక్యుమెంట్ నెం. 7244/2023** నెంబర్ గల ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. కావున ఈ డాక్యుమెంట్ దొరికి తీసుకొని వచ్చి మాకు ఇచ్చినచో వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

సంప్రదించండి : 9666126212

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE OF TADIPATRI
O.S No : 168/2022

Between:
C.Balamma ...Plaintiff
AND
E.Peddapulla Reddy and 15 Others ...Defendants

Summons to Defendents D15,D16

D15: P. Vijayakumari W/o P.Mohan Dash House No:101. Brundavanam sapthagiri Nagar, Near heart and Brain and Centre, Kurnool Town, Dist.

D16: P.Srilakshmi D/o Mohan Dash MIG-2 Road No.18, Vidhuth Nagar, Tellapur, Village, Medak Mandal and Dist.

పై దావాలో ప్రతివాదులైన మీ హాజరు నిమిత్తం 20-11-2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసినారు. ఆరోజు మీరు స్వయంగా కానీ లేక వకీలు ద్వారా కానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆ క్షేపణలు ఉన్న యెడల తెలుపు కోవలేను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

B. SADASIVA REDDY,
K.VENKATA RAMANA REDDY
Advocates, Tadipatri, Cell: 9441587088

IN THE COURT OF THE IIIRD ADDL JR. CIVIL JUDGE KURNOOL
OS. NO. 764/2024

B.Nageswara Reddy. ...Plaintiff
-Vs-
V.Sitha Rami Reddy S/o V.V.Ramana Reddy Privete contractor, Plot No. 39,40, Seshadri Nagar 2, Kurnool City. ...Defendant

ప్రతివాదికి దావా సమన్లు

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూ॥18,91,267.00లు, ముందు వడ్డీ కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయినా నీకు ఆక్షేపన ఉన్న 16.12.2025 తేదీన పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనియెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్ల మేరకు

చిట్టెల జోగారావు,
ఎం.ఆంజనేయులు,
వాదిపరం అడ్వకేట్లు,
కర్నూలు.

IN THE COURT OF THE III additional JUNIOR CIVIL JUDGE – KURNOOL
O.S.624/2023

Jampala Prasad. ...Plaintiff
- Vs-
Gnaneshwar Achari S/o. V.Gangadhara Achari, Age 32 years, Hindu, Carpenter, H.No.77-915, Near Anganwadi School, Mujaffar Nagar, Kurnool. ...Defendant

ప్రతివాదికి సమను

వాది, ప్రతివాది అయిన మీ మీద పై తెలిపిన కోర్టులో దావా దాఖల చేసినారు. మీకు కోర్టు ద్వారా సమన్లు పంపినను మీరు సమన్లు తీసుకోనందున ఇందు మూలముగా మీకు తెలియజేయడేమమగా మీ హాజరు నిమిత్తము. పైన తెలిపిన కోర్టులో తేది.30.12.2025 పగలు గం.10:30ని. లకు. నాడు వాయిదా వున్నది. మీమీద వ్యాజ్యము తెచ్చినందువల్ల స్వతహాగాని లేక క్రమముగా సంగతులు తెలియజేయబడి వ్యాజ్యంలో చేసిన ముఖ్యమైన అన్ని ప్రశ్నలకు ప్రత్యుత్తరం చెప్పబడిన ప్లీడరు ద్వారా ప్రత్యుత్తరం చెప్పగలందులకు ఆజ్ఞాపించడమైనది. లేనిచో మీపరోక్షమున ఆవాజ్యము విమర్శచేసి తీర్మానించడమగునని మీకు తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా : 30.12.2025
సమయం : ఉదయం గం॥10.30 ని॥లకు

ABDUL AZEEZ,
Advocate,
Kurnool - 518004,
Cell : 7842892275.

IN THE COURT OF THE A.P. CO-OPERATIVE TRIBUNAL AT VIJAYAWADA
O.P. NO. 87/2024

Between :
The Registra of Mutually Aided Co-Operative Societies, The District Co-Operative Officer, Kurnool, ... Petitioner
AND
R1: Sri S.K Mahesh, S/o S.C. Gupta, H.No. 40/551-1A, S.V.Compler, 2nd Floor, Karnool (Generl Secretasy).
R6: Sri S.Rama Chandrudu S/o S. Narayana, H.No.40/321-6A3 Bhaskar Nagar,Kurnool (Director).
R7: Sri K.Giddaiah S/o K.Kowlaiah, D.No.80-314-7-1, Sharada Nagar, Near Gooty Petrol Bunk, Kurnool, (Director)
R9: Sri K.Madhu Sudhakar, S/o K. Lingamoorthy (Late), H.No.78/8 A/1-1,New Krishna Nagar, Kurnool.(Director)
.... Respondent

పై నెంబరు గల ఓ.పి.లో పిటీషనర్లు అయినటువంటి రిజిష్టర్ ఆఫ్ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ కర్నూల్ వారు రెస్పాండెంటు అయినటువంటి మీపై ది కర్నూలు జిల్లా జర్నలిస్ట్ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటి రద్దు కొరకు సదరు పై కోర్టులో ఓ.పి. వేసివున్నారు. సదరు శ్రీ కోర్టువారు ఎన్ని సమన్లు పంపిననూ అందుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు పేపరు పబ్లికేషన్‌కు ఉత్తర్వులు జారీ చేసివున్నారు. కావున మీరు ది. 03-12-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు శ్రీ కోర్టువారు ఎదుట స్వయంగా గానీ, లేదా ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొన గలరు. లేనిచో పై నెంబరు గల పిటీషన్‌ను మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయటమైనది.

వాయిదా : 03-12-2025

M. Parameswara Rao, B.Com., LL.B.,
Advocate,
D.No. 31-15-11, Katurivari Street,
Machavaram Down, Vijayawada-520 004.
Cell : 9390606066

IN THE COURT OF IVTH ADDL JUNIOR CIVIL JUDGE : KURNOOL.
O.S.NO. 290/2023

Dimme Nageswara Rao. ...Plaintiff
-Vs-
1. S.Govidanaik
2. T.Rajeswari. ...Defendants

ప్రతివిదులకు దావా సమన్లు

1) ఎస్.గోవిందనాయక్ తండ్రి ఎస్.సుంకె నాయక్,
2) టి.రాజేశ్వరి భర్త గోవిందనాయక్,
ఇద్దరు ఇంటి నెం.3-78,
పెండ్లిమాన్ తాండ (గ్రా),
పత్తికొండ (మం), కర్నూలు జిల్లా.

పై నెంబర్ దావాలో వాది ప్లైంట్ దాఖల షెడ్యూలు పైన వాది హక్కును దృఢీకరించమని Consequential Injunction, ఉత్తర్వు ఇప్పించమని ప్రతివాదులపైన దావా దాఖలు చేస్తు, మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని దావా దాఖలు చేసినారు. ఇందులో 1,2 ప్రతివాదులపైన అయిన మీకు ఆక్షేపణలు ఉన్న 24-12-2025 తేదిన పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును లేని యెడతల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

షెడ్యూలు :- Plot 87-C, near to House No.87/1096, in ward No.87 laid in Sy. No.708 situated within the limits of SRO of Kallur, Kurnool District, named as Government IV Class employees colony, Kurnool,

Bounded as follows:-
East : 33 feet width road
West : Plot No.79
North : Plot No.87/B
South : remaining site in plot No.87

With measurements :-
East West : 60 feet or 18.2880 mts
North South : 22 feet or 6.7056 mts
Total extent of 1320 Sq feet or 146.66 Sq yards
Market value Rs.11,74,000/-

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 24-12-2025

కడియాల రామపుల్లయ్య,
వాదిపరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.1456/2022

వి.సుధారాణి. ...వాది
-వర్సెస్-
కె. ఈశ్వరయ్య (Died by his L.Rs)
1. కె.నిర్మల జ్యోతి భర్త లేట్ కె.ఈశ్వరయ్య వయసు 48 సంవత్సరములు
2. కె.అమృత తండ్రి లేట్ కె.ఈశ్వరయ్య వయసు 32 సంవత్సరములు
3. కె.అశోక్ తండ్రి లేట్ కె.ఈశ్వరయ్య వయసు 28 సంవత్సరములు
4. కె.దీపక్ తండ్రి లేట్ కె.ఈశ్వరయ్య వయసు 28 సంవత్సరములు
వీరల నివాసము ఇంటి నెం. బి/బి 107, బి క్యాంప్, కర్నూలు సిటి. ...ప్రతివాదులు

2వ ప్రతివాదికి దావా సమన్లు

ప్రతివాది నెం.2 అయిన నీకు తెలియపరచడం ఏమనగా, పై వాది మీ పై పైన తెలిపిన దావాను తనకు ఈశ్వరయ్య గారి నుండి రావలసిన ప్రాంసరీ నోటు బాకీ బాపతకు గాను పై దావా దాఖలు చేసియున్నారు. పై దావా నందు మీకు కోర్టు ద్వారా సమన్లు ముట్టనందున మీకు తెలియజేయడం ఏమనగా, పై దావా 25-11-2025 వ తేదిన మీ హాజరుకై వున్నది. ఇందులో 2వ ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 25-11-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరుకాని మీ తరపున అడ్వకేటు ద్వారా గాని పై కోర్టులో హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలయును. లేని యెడల సదరు దావా నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా: 25-11-2025

H. K.Jalandhar Rao,
G. Gopala Krishnaiah,
వాది పరం అడ్వకేట్లు, కర్నూలు.

IN THE COURT OF THE HON'BLE PRICIPAL JUNIOR CIVIL JUDGE : KURNOOL
O.S.NO.696/2022

P.Ramadevi. ...Plaintiff
Vs
Pamulapati Lakshmi Narasimha Prasad and Others. ...Defendant

3వ ప్రతివాదికి దావా సమన్లు

3) G. Srinivas Reddy, S/o G. Sambi Reddy, Hindu, Aged about 54 years, Resident of H.No.45/24-R-30-N26, Neelam Rasi Reddy Colony, K.C. Canal Line, Ashok Nagar, Kurnool City.

పై నెంబర్ దావాలో వాది ప్రతివాదులపైన ఈ క్రింది కనపరచిన అంశాలపైన
(i) declaring the plaintiff as the absolute lawful owner having right title interest and possessor of the suit schedule property,
(ii) upon declaration putting the plaintiff into peaceful possession and enjoyment of suit schedule property
(iii) consequentially declare the all sale deeds and documents bearing Doc.No.1029/2013, dated 16-02-2013 and subsequent fraudulent transactions vide bearing documents No. 1358/2014, dated 08-03-2014, document bearing No 15382/2021, dated 10-11-2021, document bearing No.448/2022, dated 11-01-2022, document bearing No.38/2018, dated 30-12-2017 in favour of defendant thereby declaring the aforesaid sale deed as illegal, null and void, not binding on the plaintiff
(iv) to grant a perpetual injunction restraining the defendant his men, agents, relatives, henchrnen, assignees, mangers, employees or any acting on behalf of or upon instruction from the defendant from interfering with the peaceful possession of plaintiff over suit schedule property, alienating creating any charge, lien, mortgage or change the nature of suit schedule property,
(v) to award costs of the suit,

దావా దాఖలు చేసినాడు. ఇందులో 3వ ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 24.11.20205 తేదిన పగలు 10.30 గం॥కు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల పీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

షెడ్యూలు :
The House property bearing D.No.45-24-B-10-1, plot No-2 Venkata Ramana Colony, Kurnool City, situated at within the Registration District of Kurnool, and Sub registration District of Kurnool, in Survey No.87/1, 87/2, 87/3 to an extent of 266.66 sq.yards situated within the Mamidalapadu Gram Panchayat Limits, Kurnool Mandal & District within the following boundaries.
East : Plot No.3
West : Plot No.1
North : Venkata Ramana Colony Plots,
South : 30 ft. wide road

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేది : 24-11-2025

ఎ.ఉమాదేవి,
వాదిపరం అడ్వకేటు, కర్నూలు.

పెరుగుతున్న మధుమేహ బాధితులు

-డాక్టర్ సి గోపీనాథ్‌రెడ్డి హెచ్‌ఒడి సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్ , డయాబెటాలజిస్ట్ కిమ్స్ హాస్పిటల్, కర్నూలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మధుమేహ దినోత్సవం 1991లో అంతర్జాతీయ మధుమేహ సమాఖ్య ప్రపంచ ఆరోగ్య సంస్థ చేత ఆరంభించారు. ప్రతి సంవత్సరం నవంబర్ 14న, ఇన్సులిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త సర్‌ఫ్రెడరిక్ బాంటింగ్ జన్మదినాన్ని పురస్కరించుకొని జరుపుకుంటారు. దీని లక్ష్యం మధుమేహంపై అవగాహన పెంచడం , ప్రపంచ వ్యాప్తంగా సంరక్షణకు ప్రాధాన్యతను మెరుగుపరచడం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 530 మిలియన్లకు పైగా పెద్దవారు మధుమేహంతో బాధపడుతున్నారు. 2030 నాటికి ఇది 643 మిలియన్లకు పెరిగే అవకాశం ఉంది. భారతదేశం, చైనాకు తరువాత, మధుమేహ రోగుల సంఖ్యలో రెండవ స్థానంలో ఉంది.

మధుమేహ రకాలు: టైప్ 1: ఆటోఇమ్యూన్ కారణంగా ఇన్సులిన్ లోపం. టైప్ 2: ఇన్సులిన్ నిరోధకత, జీవనశైలి కారణంగా గర్భధారణ మధుమేహం గర్భధారణ సమయంలో ఏర్పడేది.

ఇతర రకాలు: జన్యు లేదా మందుల కారణంగా

చక్కెర వ్యాధి రావడానికి గల కారకాలు కుటుంబ చరిత్ర, ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, అహితకరమైన ఆహారం, ఒత్తిడి, పొగ తాగడం, మద్యం సేవించడం.

లక్షణాలు: తరచుగా మూత్రం పోవడం, అధిక దాహం, అధిక ఆకలి, అలసట, చూపు మందగించడం, బరువు తగ్గడం, గాయాలు మానడం ఆలస్యం కావడం.

మధుమేహ నియంత్రణకు 4 సూత్రాలు

జీవనశైలి మార్పులు, శారీరక వ్యాయామం, ఆహార నియమాలు, ఔషధాలు నియమితంగా రక్త చక్కెర పరీక్షలు, జీవనశైలి మార్పులు సమతుల ఆహారం తీసుకోవాలి, వారంలో కనీసం 5 రోజులు, రోజుకు 30 నిమిషాల వ్యాయామం చేయాలి. బరువు నియంత్రణలో ఉంచాలి. పొగ తాగడం మానాలి. మద్యం పరిమితం చేయాలి. మధుమేహం దాని సమస్యల కోసం నియమిత స్క్రీనింగ్ చేయించుకోవాలి.

మధుమేహం వల్ల కలిగే సమస్యలు

నియంత్రణలో లేని మధుమేహం హృదయ రోగాలు, నాడీ సమస్యలు (న్యూరోపతి), కంటి సమస్యలు (రెటినోపతి), మూత్రపిండ వ్యాధులు (నెఫ్రోపతి) పాద గాయాలు వంటి తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుంది. ఇది కాలుకు తీసివేయడానికి ప్రధాన కారణం.

థీమ్: 'జీవితంలోని ప్రతి దశలో మధుమేహ నియంత్రణ' అవగాహన, విద్య , సమానత్వం ద్వారా అందరికీ మధుమేహ సంరక్షణ అందించడమే ప్రధాన లక్ష్యం. నియమిత స్క్రీనింగ్ చేయించుకోండి, అవగాహన పెంచండి, ఆరోగ్యకర అలవాట్లు అలవర్చుకోండి, మధుమేహ పట్ల అవగాహనను ప్రోత్సహించండి.

ప్రజా సమస్యలు.. వేగవంగా పరిష్కారం...

-నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్-అద్భుత ఫలితాలిస్తున్న నగరపాలక 'హెల్ప్ డెస్క్'

-148 ఫిర్యాదుల్లో 94 పరిష్కారం-ప్రతి రోజు ఉదయం 6 నుండి రాత్రి 10 వరకు సేవలు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

నగర ప్రజలు ఎదుర్కొంటున్న సూక్ష్మ సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రధాన ధ్యేయంగా నగరపాలక సంస్థ పనిచేస్తోందని కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ఇటీవలే కాలంలో పునరుద్ధరించిన 'హెల్ప్ డెస్క్' విభాగం అద్భుత ఫలితాలు ఇస్తోందని చెప్పారు. పండుగలు, సెలవు దినాలతో సహా ప్రతి రోజు ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు సేవలందిస్తున్న ఈ విభాగం, మేనేజర్ ఎన్.చిన్నరాముడు పర్యవేక్షణలో ముగ్గురు సిబ్బందితో సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారి మరమ్మతులు, ముళ్ల తొలగింపు, తాగునీటి సరఫరా, జంతు బెడద వంటి అనేక చిన్నచిన్న సమస్యలను స్వీకరించి సత్వరమే పరిష్కరిస్తున్నామని కమిషనర్ వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల ఇబ్బందులు తెలుసుకుని వెంటనే పరిష్కార చర్యలు తీసుకుంటున్నామని, చిన్న సమస్యలు పెద్దవిగా మారకముందే పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గడచిన నెల కాలంలో 148 ఫిర్యాదులు స్వీకరించగా, అందులో 94 సమస్యలు పరిష్కరించామన్నారు. మిగిలిన ఫిర్యాదులను కూడా త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. నగర ప్రజలు ఏవైనా ఫిర్యాదులు, ఇబ్బందులు ఎదుర్కొంటే 08518-221847 నంబరుకు కాల్ చేయవచ్చని లేదా వాట్సాప్ 7422992299 ద్వారా ఫిర్యాదు ఇవ్వవచ్చని కమిషనర్ సూచించారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

డ్రగ్స్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరం లోని బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం 'డ్రగ్స్‌పై అవగాహన' సదస్సు నిర్వహించారు. . ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ మాట్లాడుతూ, "నేటి యువతలో చాలామంది డ్రగ్స్‌కి బానిసై తమ జీవితాన్ని, భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ప్రతి విద్యార్థి డ్రగ్స్ వాడకం నుండి దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలి" అని సూచించారు. ఈగల్ టీమ్ సభ్యులు రమేష్ , మాసంవలి మాట్లాడుతూ డ్రగ్స్ నియంత్రణపై విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మల్లికార్జున, ఉల్గొజీరావు, చిన్నమల్లేశ్వరుడు, శ్రీధర్ మూర్తి, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తికొండలో టెన్త్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-పత్తికొండ

మాట్లాడుతున్న గోవింద నాయక్

వ త్తి కొం డ పట్టణంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను గురువారం జిల్లా పరీక్షల ఉప కమిషనర్ గోవింద నాయక్ సందర్శించారు. సెయింట్ జోసెఫ్ స్కూల్, యశోద గార్డెన్, ఏపీ మోడల్ స్కూల్, గవర్నమెంట్ హై స్కూల్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సెంటర్లలో ఉన్న సదుపాయాలను సమీక్షించారు.తరువాత మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్, గవర్నమెంట్ హైస్కూలులో పదవ తరగతి బోధించే ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గోవింద నాయక్ గారు మాట్లాడుతూ విద్యార్థుల ఫలితాల మెరుగుదలకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు. పిల్లల్లో ఉన్న ఇతర అలవాట్లను వదిలించుకుని పూర్తిగా పరీక్షలపై దృష్టి పెట్టేలా వారికి మార్గదర్శనం ఇవ్వాలని, కనీసం 90 శాతం పాస్‌పర్సంటేజ్ సాధించేలా శ్రమించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి రమేష్,ఎగ్జామినేషన్ సీనియర్ అసిస్టెంట్ ఖాన్ , సిఆర్‌పి తులసీధర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సిపిఎం, ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి -సి బెళగల్ : 40 ఏళ్ల కిందట వేసిన రోడ్డు తర్వాత నూతన రోడ్డుకు సి బెళగల్ మండల కేంద్రంలో అధికారులు, నాయకులు శ్రీకారం చుట్టారని అయితే 40 అడుగుల వెడల్పుతో పురోగతి సాధించినట్టేనని , 23 అడుగుల విస్తరణతో మళ్ళీ అథోగతేనని సిపిఎం పేర్కొంది. గురువారం సి.బెళగల్‌లో భగత్ సింగ్ సంఘం కార్యదర్శి పరమేష్, సర్పంచి పాండురంగన్న, పిరమిడ్ సంఘం అధ్యక్షులు వెంకటేష్, టికె ఎస్ నాయకులు జోజి ల సమైక్య వేదికలో సిపిఎం ప్రాంతీయ నాయకులు మోహన్ బస్టాండ్ దగ్గర రాస్తారోకో చేపట్టారు. ఇందుకు సిపిఎం అనుబంధ సంఘాలు మద్దతుగా నిలిచాయి. ఏళ్లుగా రోడ్డు దుస్థితి అథోగతిగా మారిందని కోడుమూరు ఎమ్మెల్యే అసెంబ్లీలో ఆవేదన వ్యక్తం చేసిన ఫలితం నూతన రోడ్డు మంజూరు కావడం హర్శించదగ్గ విషయమని అన్నారు. 23 అడుగుల వెడల్పుతో మళ్ళీ అదే ట్రాఫిక్, అదే ఇరుకు రోడ్ల మధ్య ప్రమాదాలు, ప్రాణాలు పోగొట్టుకోవడం, వాహన రాక పోకలకు ఇబ్బంది సమస్యలేనని నాయకులు తెలిపారు. అభి వృద్ధి చెందుతున్న మండలాల్లో సి బెళగల్ ఉందని, డివైడర్ రోడ్డుకు సహకారం అందించాలని, డ్రైనేజి నిర్మించాలని మొత్తానికి సుందరికరణ చేయాల్సిన అవశ్యకథ ఉందని అన్నారు. బస్టాండ్‌లో ఆక్రమణలు తొలగించి మరుగుదొడ్ల సౌకర్యం కల్పించా లన్నారు. పోలకల్ నుండి ఎమ్మిగనూరు వరకు డబుల్ రోడ్డు కోసం నాయకులు, అధికారులు క్షేత్రస్థాయి అభివృద్ధికీ అభ్యున్నతికి బాటలు వేయాలని సిపిఎం విజ్ఞప్తి చేసింది. అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిని అందజేయగా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఇక్కడి రోడ్డు విస్తరణ 40 అడుగులు అవసరమేనేనని ఆమె తెలిపారు.

చాచాజీకి మనవి

చాచా నెహ్రూ జీ, నీ గుండె తోటలో విర బూసిన గులాబీలం మేము, అందుకేగా నీ కోటుకు గుర్తుగా గులాబీ పువ్వునుధరించావు, మేమంటే ఎంతో ఇష్టం కదా చాచా, మరి నువ్వు ఇప్పుడుండి ఉంటే, నీ ప్రియమైన ఎర్ర గులాబీలం మేము ఎలా వశివాడి పోతున్నామో చూసి ఉంటే నీ కన్నుల్లో కన్నీరు రాలి నీ కోటుపై గులాబీ తడిసి ముద్దయి పోయేది. మమ్మల్ని క్షమించండి, చిన్నారులు ఉత్సాహానికి, పసితనంలో అమాయకత్వానికి ప్రతీకలన్నావు, మమ్మల్ని చూస్తే నీవూ పసివాడివై పరుగులుపెడుతూ, ముందుకు సాగుతానన్నావు.... మరి ఇప్పటి మా పరిస్థితి చూసావా?బాలలను నీ అంతగా ప్రేమించే చాచాలు మచ్చుకైనా కానరావడం లేదు. మాతో వెట్టి చాకిరి చేయించే వారు ఒకరు, బాల కార్మికులుగా చేసి, చదువుకు దూరం చేసే వారు మరొకరు, తాగి వళ్ళు హూనం చేసే యజమానులు, కూలీ డబ్బులివ్వకుండా ఎగ్గొట్టే వారు, పసి వారిని ఎత్తుకుపోయి అమ్ముకునే వారు కొందరు, యింకా తెలుసా చాచా పసిమొగ్గలను నలిపి, నాశనం చేస్తూ, రా క్షసానందం పొందేవారు ఇంకొందరు. ఏమిటిది చాచా, మా ఆర్త నాదాలు నీకు చేరలేదా?మాకు యీ ప్రపంచంలో నీ ప్రేమ వారసులుగా జీవించే హక్కు లేదా? మాకీ హింసాత్మక లోకం వద్దు నీ ప్రేమ వనంలో మేము హాయిగా ఆడుతూ పాడుతూ బ్రతికే లోకాన్ని ప్రసాదించు. మా మంచి బంగారు చాచా.. మా మనవి అలకించవా.....!

డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా9866137204

పేదల సొంతింటి కల సాకారం

-కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం మల్లికార్జున స్వామిని గురువారం దర్శించుకున్నారు.ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సొంతిళ్లు ఉండాలనే మాజీ సిఎం ఎన్‌టిఆర్ ఆశయాన్ని సిఎం చంద్రబాబు నాయుడు సమర్థ విధానాలతో 16 నెలల్లోనే 3 లక్షల ఇళ ్ళ పూర్తి చెసి పేదలకు అందజేసి పేదల సొంతింటి కలను కూటమి ప్రభుత్వం సాకారం చేసిందని అన్నారు.

రంధ్రం ఆదమరిస్తే అంతే

ప్రజాశక్తి సి బెళగల్

తిమ్మందొడ్డి, చింతమాను పల్లి మధ్య గ్రావెల్ రోడ్డులో కల్వర్టు శితిలం అయ్యింది. ఆ కల్వర్టు నిర్మించి పది సంవత్సరాలు కాకముందే కులడానికి సిద్ధంగా ఉండడటంతో అక్కడే మధ్యలో రంధ్రం ఏర్పడి ఉండటం వాహనదారులు భయం భయం గా దాటి వెళ్తున్నారు. తిమ్మందొడ్డి పునరావాస గ్రామంగా 2011లో ఏర్పడింది.. ఆ గ్రామానికి సి బెళగల్ నుండి వెళ్లాలన్నా రావాలన్నా ఇదే రోడ్డు గతి అయ్యింది. ఏళ్లుగా బీటి కు నోచుకోవడం లేదు.రాత్రి వేళ కల్వర్టు దగ్గర ఆదమరచి వెళితే ప్రాణాలు హామ్ ఫట్ అనీ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నాయకులు ద్రుష్టి సారించి నూతన కల్వర్టును నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

బిసి జనగణన ఆపడం సరికాదు: బిఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జనగణన చేపట్టాలని హైకోర్టు ఆదేశించినా ప్రభుత్వం ఏదో ఒక సాకు చెబుతూ కాలం వెళ్లబుచ్చుతోందని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి గాడిఅరుణ్ కుమార్ అన్నారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. తమిళనాడు, కర్ణాటక స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ కూడా రానున్న ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందన్నారు. ఎపి మాత్రం ఈ విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. 2026 లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బిసి జన గణన, వర్గీకరణ చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా సర్కార్ను ఆదేశించాలని కోరారు.రాజ్యాంగంలోని అధికరణలో 243డి, 253టి ప్రకారం ఎస్‌సి, ఎస్‌టిలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తున్నారని అయితే బిసిల విషయంలో జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఇవ్వడం లేదని, ఇది రాజ్యాంగ విరుద్ధమని అరుణ్ కుమార్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు రిజర్వేషన్లపై ఎలాంటి నిషేధం లేదన్నారు. 1986లో బిసి జన గణన జరిగిందని అప్పటి నుంచి ఇప్పటివరకు మళ్లీ జరగలేదని, అప్పటి గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్నారని, ఇది అన్యాయమని అన్నారు. దీనిని బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.